

'కంటివెలుగు'లేవి?

విద్యార్థులకు కంటి వెలుగు నిర్వహించకపోవడంపై విద్యార్థి సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- 8లో ▸



రెగ్యులరైజ్ చేయాలి

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సెకండ్ ఏఎన్ఎంలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.0 /14.4

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు మరింత తగ్గవచ్చు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ విప్‌కు మంత్రి పరామర్శ



సాక్షి, కామారెడ్డి: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను మంగళవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. కాలి నొప్పితో ఆస్పత్రిలో చేరిన ఆయనను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

2.10 లక్షల ఎకరాల్లో వరినాట్లు పూర్తి



బాన్సువాడ రూరల్: జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు 2.10 లక్షల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని డీఏవో భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె చిన్న రాంపూర్ శివారులోని పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేశామన్నారు. జిల్లాలో వ్యవసాయ విస్తీర్ణాధికారుల ఆధ్వర్యంలో పంటల నమోదు ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోందన్నారు. ఈనెల 20లోపు అరుతడి పంటల నమోదు ప్రక్రియ పూర్తవుతుందన్నారు. తీవ్రమైన చలిగాలులు వల్ల వరిలో ఎదుగుదల ఆశించిన స్థాయిలో లేదన్నారు. పలుచోట్ల ఉల్లికోడు, కాండం తొలుచు పురుగు సమస్య గుర్తించామన్నారు. రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో రాజేష్, చిన్న రాంపూర్ ఉప సర్పంచ్ షేక్ అజీం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమితులైన వెంకటేశ్వర్ మంగళవారం ఉదయం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో బాధ్యతలు స్వీకరించారు. డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి, ఆర్ఎంవో శ్రీనివాస్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

గ్రూప్స్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-2, 3, 4 పరీక్షలకు 3 నెలల పాటు నాన్ రెసిడెన్షియల్ కోచింగ్ ఇవ్వనున్నారు. ఆసక్తిగలవారు ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3 లక్షలలోపు వార్షికాదాయం ఉన్న ఎస్సీ కుటుంబాలకు చెందిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నాలుగు రోజులు.. రూ. నాలుగు కోట్లు

- ఆర్టీసీకి కలిసొచ్చిన సంక్రాంతి పండుగ

ఖలీల్‌వాడి: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపి ఆర్టీసీ భారీగా ఆదాయాన్ని గడించింది. గతేడాదికంటే ఈసారి రాబడి మెరుగుపడినట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ సందర్భంగా నగరాలు, పట్టణాల్లో ఉన్న ప్రజలు పల్లెబాట పట్టారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోగల ఆరు డిపోల నుంచి ఈనెల 7 నుంచి 17 వరకు రోజువారీ బస్సులతో పాటు అదనంగా ప్రత్యేక బస్సులను నడిపారు. పండుగకు హైదరాబాద్ నుంచి పల్లెలకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరింది. ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రూ. 3.99 కోట్ల ఆదాయం వచ్చిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అంతేకాకుండా పండుగ తర్వాత ప్రజలంతా తిరుగు ప్రయాణం అవుతున్నారు. దీంతో మరో రెండు రోజుల పాటు బస్సులు రద్దీగానే ఉండనున్నాయి. దీంతో మరింత ఆదాయం సమకూరనుంది.

తగ్గేదే లే..!

కామారెడ్డి మున్సిపల్ మాస్టర్ ప్లాన్ రద్దు కోసం ఉద్యమించిన రైతులు ఎక్కడా తగ్గడం లేదు. నెలన్నరగా అలుపెరుగని పోరు కొనసాగిస్తూనే ఉన్నారు. రోజుకో తీరున నిరసన తెలుపుతున్నారు. సంక్రాంతి పండుగ పూటా ఆందోళనలు చేసిన బాధిత రైతులు.. మంగళవారం పాతరాజంపేటలో సమావేశమై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు.

- మాస్టర్ ప్లాన్ రద్దు కోసం కొనసాగుతున్న ఆందోళనలు
- కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని డిమాండ్
- 20న ప్రభుత్వ విప్ ఇంటి ముట్టడికి పిలుపు
- భవిష్యత్ కార్యాచరణ ప్రకటించిన రైతు జేఏసీ



రాజీనామా పత్రాన్ని అందించిన కౌన్సిలర్లు రవి, శ్రీనివాస్



ఉద్యమ కార్యాచరణపై చర్చిస్తున్న రైతు జేఏసీ ప్రతినిధులు

సాక్షి కామారెడ్డి/కామారెడ్డి టౌన్: మాస్టర్ ప్లాన్‌తో నష్టపోతున్న పాతరాజంపేట, రామేశ్వరపల్లి, దేవునిపల్లి, లింగాపూర్, అడ్లూర్, ఇల్చిపూర్, టేక్రియాల్, అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామాల రైతులు మంగళవారం పాతరాజంపేటలో సమావేశమయ్యారు. ఉద్యమ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. పలు తీర్మానాలు చేశారు.

లింగాపూర్‌లో ఈనెల 12వ తేదీన జరిగిన సమావేశంలో విలీన గ్రామాలకు చెందిన 8 మంది కౌన్సిలర్లు రాజీనామాలు చేసి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరిన విషయం తెలిసిందే.. పాతరాజంపేట్ సమావేశంలో దీనికి డెడ్‌లైన్ విధించారు. విలీన గ్రామాలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీకి అరుగురు, బీజేపీకి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన గడ్డమీది రాణి, ఆకుల రూప, పడిగె సుగుణ, ఉర్దొండ వనిత, కాసర్ల గోదావరి, జాజుల శంకర్‌రావు, పోలీస్ కృష్ణాజీరావులతో పాటు బీజేపీకి చెందిన రవి, శ్రీనివాస్ గురువారం సాయంత్రం వరకు తమ పదవులకు రాజీనామా చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించి మాస్టర్ ప్లాన్ రద్దు కోసం తీర్మానం చేయాలని కోరుతున్నారు.

రాజీనామా లేఖలిచ్చిన బీజేపీ కౌన్సిలర్లు..

ఉద్యమానికి మద్దతుగా ఉంటున్న బీజేపీకి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ సుతారి రవి, 11వ వార్డు కౌన్సిలర్ కాసర్ల శ్రీనివాస్.. రైతుల కోసం తమ పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధమని గతంలోనే ప్రకటించారు. మంగళవారం జరిగిన రైతుల సమావేశంలో రాజీనామాల లేఖలను రైతు జేఏసీ నాయకులకు అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాతల కాలంనుంచి ఈ భూముల్లో పంటలు పండించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. పొలాల్లో ఉండాల్సిన తాము.. మాస్టర్ ప్లాన్ వల్ల రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వతంగా రోడ్డున పడేయొద్దంటూ కంటతడి పెట్టుకున్నారు. రాజీనామాకు ముందుకు వచ్చిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. రాజీనామా చేసిన కౌన్సిలర్లను తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకుంటామన్నారు. రైతుల నిర్ణయాన్ని కాదని ఎవరైనా పోటీకి వస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

ముట్టడి టెన్షన్..

కౌన్సిల్ సమావేశం నిర్వహించి మాస్టర్ ప్లాన్ రద్దు కోసం తీర్మానం చేయాలని, లేకపోతే ప్రభుత్వ విప్ ఇంటిని ముట్టడిస్తామన్న రైతుల హెచ్చరికతో అంతటా టెన్షన్ నెలకొంది. రైతులతోపాటు వారికి మద్దతు తెలుపుతున్న నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసే అవకాశాలుంటాయని భావిస్తున్నారు. అరెస్టు చేస్తారని భావిస్తున్న రైతులు.. అందరూ అప్రమత్తంగా ఉండాలని నిర్ణయించారు. రైతులు కుటుంబ సభ్యులతో సహా సద్దులు కట్టుకుని ముట్టడికి రావాలని పిలుపునిచ్చారు. మాస్టర్ ప్లాన్ రద్దు కోసం ఆందోళనలు చేస్తున్న 120 రైతులపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. లాఠీచార్జీ చేసినా, కేసులు పెట్టినా వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. మరోవైపు రైతుల ఉద్యమం రోజురోజుకు ఉధృతం అవుతుండడంతో కౌన్సిలర్లు అయోమయానికి గురవుతున్నారు. రాజీనామాలపై ఎటూ తేల్చుకోలేకపోతున్నారని సమాచారం. ఇంకోవైపు ప్రభుత్వ విప్ ఇంటి ముట్టడి పిలుపు నేపథ్యంలో దానిని ఎలా ఎదుర్కోవాలన్న విషయమై పోలీసులు ఇప్పటినుంచే కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

ఉద్యమం ఆగదు



మా భూములకు గతంతో ధర ఎక్కువగా ఉండే.. గ్రామంలో మాకున్న మూడు ఎకరాలను ఇండస్ట్రియల్ జోన్‌లోకి మార్చారు. ఇప్పుడు మా భూములను కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేరు. మాస్టర్ న్ రద్దేయ్యేవరకు ఉద్యమం కొనసాగిస్తాం. రైతుల గోస పట్టించుకోకపోతే పాలకులకు తగిన బుద్ధి చెబుతాం.

– గాదం నారాయణ, రైతు, అడ్లూర్

కొట్లాడితేనే భూమి మిగులుతది



నాకు 72 ఏళ్లు. ఊరిలో నాకున్న నాలుగు ఎకరాల్లో 54 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. భూమే తిండి పెడుతోంది. మాస్టర్ ప్లాన్‌తో ఆ నాలుగు ఎకరాలు రోడ్డులోనే పోతదట. అంతా కలిసి కొట్లాడితేనే భూమి మిగులుతది. అందరం కదలిరావాలి.

– జంగయ్య, రైతు, టేక్రియాల్

చూస్తూ ఊరుకోం..



మాకున్న 4 ఎకరాల 20 గుంటల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నం. తాతల కాలంనుంచి భూమి వస్తోంది. దానిని రిక్రియేషన్ జోన్‌లోకి మార్చారు. జోన్ మార్చడంతో భూముల విలువ పడిపోతుంది. మా భూముల జోలికి వస్తే ఊరుకోం.

– బాలయ్య, రైతు, పాతరాజంపేట

ఉసురు తగులుతది



మాకు 7 ఎకరాల భూమి ఉంది. ఇందులో నాలుగు ఎకరాలు రిక్రియేషన్ జోన్‌లో మరో మూడు ఎకరాలు ఇండస్ట్రియల్ జోన్‌లోకి మార్చా రు. మమ్మల్ని అడగకుండా ఇలా ఎలా చేస్తారు. మా భూములను లాక్కోవద్దు. ఇబ్బంది పెట్టెటోళ్లకు మా ఉసురు తగులుతది.

– లక్కాకుల పెంటవ్వ, రైతు, పాతరాజంపేట

'రైతులకు న్యాయం చేయాలి'



మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

కామారెడ్డి టౌన్: మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రైతు సంఘం జాతీయ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాతరాజంపేట్‌లో జరిగిన రైతు సమావేశంలో పాల్గొని, రైతుల ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ల పేరుతో ప్రభుత్వం భూములు సేకరించి కంపెనీలకు అంటగట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం పేద రైతుల భూములను ఇండస్ట్రియల్, గ్రీన్, రిక్రియేషన్ జోన్లుగా మారుస్తున్నారని, రోడ్లకు తీసుకుంటున్నారని ఆరోపించారు. చట్ట ప్రకారం భూములు కోల్పోతున్నవారిలో 80 శాతం మంది ఒప్పుకుంటేనే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ రైతులకు తెలపకుండానే కుట్ర చేస్తున్నారన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలన్నారు. ఆయన వెంట సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్, నాయకులు మల్లేష్, నర్సింలు, కమ్మరి సాయిలు తదితరులు ఉన్నారు.

భూమి పోతే బిడ్డల భవిష్యత్తేంది?

- ఆందోళనతో రైతు ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చేర్చిన కుటుంబ సభ్యులు



రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి



బాలకృష్ణను పరామర్శిస్తూ..

కామారెడ్డి టౌన్: మాస్టర్ ప్లాన్‌లో తమ భూమి పోతుందని బలవన్మరణానికి పాల్పడిన అడ్లూర్ ఎల్లారెడ్డి రైతు పయ్యావుల రాములు ఉదంతాన్ని మరువకముందే మరో రైతు ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలిలా ఉన్నాయి. రామేశ్వర్‌పల్లికి చెందిన మర్రిపల్లి బాలకృష్ణకు గ్రామంలో ఎకరం భూమి ఉంది. వ్యవసాయంతో పాటు మేస్త్రీగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లున్నారు. కవలలైన కూతుళ్లు తాడ్వాయి మండలంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ చదువుతున్నారు. వారిని డాక్టర్లు చేయాలన్నది బాలకృష్ణ ఆకాంక్ష. కూతుళ్ల భవిష్యత్‌కోసం భూమిని అమ్మాలని నిర్ణయించుకున్నాడు. గతంలో భూమిని అమ్మకానికి పెట్టగా ఎకరాకు రూ. 50 లక్షలు ఇవ్వడానికి పలువురు ముందుకు వచ్చారు. మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదనతో అతడి భూమి రిక్రియేషన్ జోన్‌లోకి మారడంతో ఇప్పుడు దానిని కొనడానికి ఎవరూ రావడం లేదు. దీంతో మనోవేదనకు గురవుతున్న బాలకృష్ణ మంగళవారం ఇంటి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలకృష్ణను బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పరామర్శించారు. తన కూతుళ్ల భవిష్యత్తు కోసం భూమిని అమ్మాలనుకున్నానని బాలకృష్ణ తెలిపాడు. రిక్రియేషన్ జోన్‌లోకి వెళ్లడంతో భూమికొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదని, అందుకే ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నానని పేర్కొన్నాడు. అయితే భూములు ఎటూపోవని, న్యాయం జరిగే వరకు వెంట ఉంటానని వెంకటరమణారెడ్డి భరోసా ఇచ్చారు. రైతులెవరూ ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని కోరారు. మెరుగైన వైద్యం కోసం బాలకృష్ణను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

వచ్చేనెలలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు

కామారెడ్డి అర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు సంబంధించిన పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ విషయాన్ని డీఈవో రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు వచ్చేనెల 11 నుంచి 14 వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు 11 నుంచి 13 వ తేదీవరకు ఉంటాయని తెలిపారు. పరీక్షలన్నీ కామారెడ్డిలోనే నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు www.bse.telangana.gov.in ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

'కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులివ్వాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో 25న నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవంలో కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు దినోత్సవం రోజున ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. వేడుకలకు సీనియర్ సిటిజన్స్ ఫోరం, దివ్యాంగుల సంఘం ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. డివిజన్ కేంద్రాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాలు నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, యువజన, క్రీడల అధికారి దామోదర్ రెడ్డి, ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, శీను, జిల్లా ఎన్నికల సూపరింటెండెంట్ సాయిభుజంగరావు, కామారెడ్డి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన



మెడికల్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలో మెడికల్ కళాశాల కోసం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పెరుగు వెంకటేశ్వర్‌తో కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మెడికల్ కళాశాల తరగతులు నిర్వహించడం కోసం ఇంజినీరింగ్ కళాశాల భవనాన్ని పరిశీలించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌కు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి పర్యవేక్షకురాలు విజయలక్ష్మి, వైద్యుడు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో బాదుడు

- 'విద్యుత్ వినియోగదారులపై 'ఏసీడీ' పిడుగు
- బిల్లులు చెల్లించలేక ఇబ్బందిపడుతున్న సామాన్యులు



ఓ వినియోగదారుకు వచ్చిన విద్యుత్ బిల్లు

రాజంపేట: అడ్డగోలుగా పెరిగిన బిల్లులతో ఇబ్బందిపడుతున్న విద్యుత్ వినియోగదారులపై మరో పిడుగు పడింది. ఏసీడీ(అడిషనల్ కన్జంప్షన్ డిపాజిట్) పేరిట అదనపు బిల్లులు వడ్డిస్తుండడంతో సామాన్యులు ఇబ్బందిపడుతున్నారు. ఇవేం చార్జీలో తెలియక అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

విద్యుత్ చార్జీలు గతేడాది గణనీయంగా పెరిగాయి. వినియోగదారులను అంతటితో వదిలిపెట్టకుండా కస్టమర్ డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేశారు. తాజాగా ఏసీడీ డ్యూస్ పేరుతో మళ్లీ అదనపు బిల్లులు వడ్డిస్తున్నారు. వినియోగించిన యూనిట్లతో సంబంధం లేకుండా అడ్డగోలుగా బిల్లులు వస్తుండడంతో వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. ఇంతగా బిల్లులు ఎందుకువచ్చాయో తెలియక సామాన్యులు అయోమయానికి గురవుతున్నారు.

వినియోగదారుల్లో ఆందోళన

300 యూనిట్ల వినియోగం దాటితేనే ఏసీడీ డ్యూ చార్జీలు వస్తాయని విద్యుత్ అధికారులు చెబుతున్నప్పటికీ.. అంతకంటే తక్కువగా వినియోగించిన వారికి కూడా చార్జీలు విధిస్తుండడం గమనార్హం. గతంలో కేటగిరి 2లోని వాణిజ్యపరమైన కనెక్షన్లకు విద్యుత్ వినియోగం పెరిగినప్పుడు ఏ విధంగానైతే అదనపు బిల్లులు వేశారో.. ప్రస్తుతం నివాస గృహాలకు సైతం అదే విధానాన్ని అమలు చేస్తున్నారని తెలుస్తోంది. అనుమతి పొందిన యూనిట్ల కంటే ఎక్కువగా వినియోగించిన వారికి గతేడాది కస్టమర్ డెవలప్‌మెంట్ చార్జీలు విధించారు. దీంతో వేలాది రూపాయల బిల్లులు వచ్చాయి. ఈసారి ఏసీడీ పేరుతో బాదుతుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. బిల్లులను తగ్గించాలని కోరుతూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

అదనపు భారం..

ఇంటిని నిర్మించుకున్న సమయంలో అప్పటి విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఒకటి లేదా రెండు కిలోవాట్ల సామర్థ్యంతో కనెక్షన్ తీసుకుంటారు. దాని ప్రకారం అధికారులు డిపాజిట్ తీసుకుని మీటర్లు అమర్చుతారు. అనుమతి కలిగిన దానికంటే ఎక్కువ విద్యుత్ వినియోగించినట్లు తేలితే ఏసీడీ డిపాజిట్ పెంచుతారు. గతంలో నెలకు 300 యూనిట్లు దాటితే ఏసీడీ కింద అదనపు బిల్లు వసూలు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిమితి ఎత్తేసినట్లు తెలుస్తోంది. వినియోగించిన విద్యుత్ యూనిట్లను లెక్కించి బిల్లులో ఏసీడీ డ్యూ చార్జీలు వేస్తుండడంతో వినియోగదారులందరిపై భారం పడుతోంది.

అడ్డగోలుగా బిల్లులు..



డిసెంబర్ నెలకు సంబంధించి 33 రోజులకు 47 యూనిట్ల విద్యుత్ వినియోగించాం. విద్యుత్ వినియోగానికి సంబంధించి రూ. 177 బిల్లుతోపాటు ఏసీడీ డ్యూ చార్జీ రూ. 690 విధించారు. పేదలపై భారం మోపడం సరికాదు.

– మీర్ మహ్మద్, రాజంపేట

ఏసీడీ డ్యూ రూ.552 వచ్చింది



డిసెంబర్ నెలలో 31 రోజులకు గాను 94 యూనిట్ల విద్యుత్ వాడాం. కరెంటు బిల్లు రూ. 330తోపాటు ఏసీడీ డ్యూ చార్జీ రూ. 552 విధించారు. ఇలా అదనపు చార్జీలువేసి పేదలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు.

– అర్గొండ చంద్రం, రాజంపేటవాసి

లోడ్ ఆధారంగానే బిల్లు..

విద్యుత్ వాడకం ఆధారంగానే విద్యుత్ బిల్లులు వస్తాయి. వినియోగదారులు అధికంగా విద్యుత్ వాడితే ఏసీడీ డ్యూ విధిస్తారు. ఏడాదికి ఒకసారి ఇలా ఏసీడీ బిల్లు డ్యూ చెల్లించాల్సింది ఉంటుంది. ఈ విషయమై ఏవైనా సందేహాలుంటే విద్యుత్ అధికారులను సంప్రదించాలి.

– మారుతి, ఏఈ, రాజంపేట

క్లుప్తంగా

మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రెయినీ కలెక్టర్



ఎల్లారెడ్డి: కలెక్టర్ శిక్షణలో భాగంగా బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సందర్శించారు. కార్యాలయంలో మున్సిపల్ విధుల వివరాలను అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌ను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా అన్ని కార్యాలయాలను పరిశీలించి వారు చేసే పనుల గురించి తెలుసుకుంటారని అధికారులు వివరించారు.

క్రీడాకారులకు అభినందన



కామారెడ్డి క్రైం/గాంధారి(ఎల్లారెడ్డి): ఇటీవల జరిగిన జాతీయస్థాయి సౌత్ జోన్ సీనియర్ బాలికల షూటింగ్ బాల్ పోటీల్లో గాంధారి మండలం పోతంగల్ గ్రామానికి చెందిన ప్రణీత, సింధు బంగారు పతకాలను సాధించారు. సీనియర్ బాలుర విభాగంలో అభిలాష్ రెడ్డి ద్వితీయ స్థానం పొందారు. జూనియర్ విభాగంలో సాయికృష్ణ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా క్రీడాకారులను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. కోచ్ లక్ష్మణ్ రాథోడ్, జిల్లా షూటింగ్ బాల్ అధ్యక్షుడు సాయి కుమార్, జిల్లా కార్యదర్శి, పోతంగల్ కలాన్ పీఈటీ లక్ష్మణ్, జెడ్పీటీసీ శంకర్ నాయక్, సర్పంచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్స్ డీఎంగా జగదీష్ బాధ్యతల స్వీకరణ



సుభాష్‌నగర్: పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా జగదీష్‌కుమార్ మంగళవారం కొత్త కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఎంగా ఉన్న డీఎస్‌ఓ చంద్రప్రకాశ్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. జగదీష్ కుమార్ మహబూబ్‌నగర్ డీఎంగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. ఈసందర్భంగా చంద్రప్రకాశ్ ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆకట్టుకుంటున్నా.. అనుమతి లేదు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన గల జెన్‌కో, జల విద్యుదుత్పత్తి కేంద్ర ఆవరణ ఎంతగానో ఆకట్టుకుంటుంది. కేంద్రం ఆవరణలో పచ్చని చెట్ల మధ్య గల నీటి ఫౌంటేన్, పచ్చని గడ్డిలో అక్షరాలతో లిఖించిన జెన్‌కో, కాకతీయుల కళా తోరణం, పచ్చదనం ఎంతో ఆకర్షణగా నిలుస్తున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చే పర్యాటకులను ఈ జెన్‌కో ఆవరణలోకి అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో పర్యాటకులు ఆ ఆహ్లాదాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. ఇప్పటికైనా జెన్‌కో సందర్శనకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను పర్యాటకులు కోరుతున్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన గల జెన్‌కో స్వాగత తోరణం



విద్యుదుత్పత్తి కేంద్ర కార్యాలయ ఆవరణలో ఫౌంటెయిన్..



పచ్చని గడ్డి మధ్య అక్షరాల్లో జెన్‌కో



కేంద్రం ఆవరణలో పైలాన్

సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో చాల ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని సెకండ్ ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ.. సెకండ్ ఏఎన్ఎంకు సమాన పనికి సమాన వేతనం, పేస్కేల్ అమలు చేయాలన్నారు. కుటుంబ సభ్యులను సైతం పట్టించుకోకుండా పనులు చేస్తున్నా వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశా రు. సెకండ్ ఏఎన్ఎంలు సుజాత, కృష్ణవేణి, పద్మ, రేణుకా, సునిత, జ్యోతి, కవిత, యాదమ్మ, మాధవి, శిరీష, జ్యోతి, బాలమణి, తదితరులున్నారు.



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

సీఐటీయూ ఆధ్వర్యంలో...

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వారు కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేకర్, ఏఎన్ఎంలు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: గిరిజనుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మండలంలోని పొట్టిగుట్ట తండాలో మంగళవారం పాఠశాల భవనాన్ని, వ్యక్తిగత డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్పీకర్ ప్రారంభించారు. అలాగే సేవాలాల్ మహారాజ్ జగదాంబ మాత ఆల య ప్రహరీ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధిని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కేసీఆర్ సారథ్యంలో జరుగుతోందన్నారు. కుల, మత, జాతి విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరి దాసు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్, బాలరాజు, గిరి, కరీం, కృష్ణారెడ్డి, సాయిబాబా, శ్రీను, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

‘సాగర’ తీరంలో సాగుకు ఏర్పాట్లు

- బ్యాక్ వాటర్ ప్రాంతంలో..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ముంపు భూముల్లో యాసంగిలో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో మండలంలోని జలాల్‌పూర్, నాగాపూర్, బస్సాపూర్ గ్రామాల శివారు భూములు నీటిలో మునుగుతాయి. ప్రస్తుత సంవత్సరం ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో యాసంగి ప్రారంభం వరకు ప్రాజెక్ట్ నీటి మట్టం నిండుకుండల ఉంది. ప్రస్తుతం నీటి విడుదల కొనసాగుతుండటంతో ఇప్పుడిప్పుడే ముంపు నుంచి భూములు బయట పడుతున్నాయి. ఆ భూముల్లో వరి పంటను సాగు చేయడం కోసం అన్నదాతలు సిద్ధమవుతున్నారు. నారు మడులు సిద్ధం చేసి నారు పోస్తున్నారు.

ప్రాజెక్టు నిర్మాణంలో 91గ్రామాలు మునక..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో 91 గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. కొన్ని గ్రామాలు పాక్షికంగా నీట మునిగాయి. ప్రస్తుతం బ్యాక్ వాటర్ నిలిచే భూముల్లో నీరు వచ్చి చేరితే భూములను వదులుకుంటారు. జలాల్‌పూర్, నాగాపూర్, బస్సాపూర్ గ్రామాల శివారుల్లో సుమారు 100 ఎకరాల్లో బ్యాక్ వాటర్ నిలిచి యాసంగి నాటికి తగ్గుతుంది. కాని సాగు చేసిన పంట చేతికందే భరోసా తక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. 2015లో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీరు లేక ఎండిపోయింది. ఆ సమయంలో ప్రాజెక్ట్‌లో అధికంగా శనగ పంటను సాగు చేశారు. కానీ ప్రస్తుత సంవత్సరం అలా సాగు చేసే అవకాశం లేదు. కేవలం బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాల్లోనే సాగు చేసే అవకాశం ఉండటంతో రైతులు ఆ దిశగా కృషి చేస్తున్నారు. ప్రాజెక్ట్ అంచున పంటలు సాగు చేయడంతో నీటి సమస్య ఉండదని రైతులు అంటున్నారు. ఖరీఫ్‌లో మాత్రం ప్రస్తుత సంవత్సరం వేసిన పంటల్లో కూడ నీరు వచ్చి కొన్ని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 90 టీఎంసీల నీరు నిల్వ ఉంచిన సందర్భాల్లో ఎక్కువగా భూములు నీట మునిగాయి. అందుకు ప్రాజెక్ట్ అధికారులు 75 టీఎంసీలకు చేరినప్పటి నుంచే గోదావరిలోకి నీటి విడుదలను చేపట్టారు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలు గట్టెక్కుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



‘ధరణి టౌన్‌షిప్’లో వసతులు కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధరణి టౌన్‌షిప్ ప్లాట్ల యజమానులు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణి టౌన్‌షిప్ ప్లాట్ల వెంచర్‌లో సంవత్సరం దగ్గర పడుతున్న ఇప్పటి వరకు వసతులు కల్పించలేకపోయారని తక్షణమే వసతులు కల్పించాలని ప్లాట్ల యజమానులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఓపెన్ యాక్షన్ నిర్వహించిన సమయంలో సంవత్సరంలోపు ఈ ధరణి టౌన్‌షిప్‌లో రోడ్డు, విద్యుత్, నీటి తదితర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, ప్లాట్లను విక్రయించారని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేరని వాపోయారు. అలాగే మిగిలిపోయిన ఇళ్ల, ప్లాట్లను కొనడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదని, కనీసం ప్లాట్లు కొనుగోలు చేసిన వారి కోసం తక్షణమే అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ధరణి టౌన్‌షిప్ ప్లాట్ల యజమానుల కమిటీ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శివరాజయ్య, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భస్వంత్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సోమశేకర్, మోహన్‌రెడ్డి, శ్రీధర్, ప్రేమ్‌సాగర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ‘కంటివెలుగు’లేవి?

- నేటి నుంచి రెండోవిడత ప్రారంభం
- 18ఏళ్లు పైబడిన వారికే కంటి పరీక్షలు
- ప్రభుత్వ తీరుపై విద్యార్థిసంఘాల ఆగ్రహం

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం నిర్వహిస్తోంది. బుధవారం నుంచి ఈ కార్యక్రమం మొదలు కానుంది. 70 బృందాలు షెడ్యూల్ ప్రకారం కంటి వెలుగు కార్యక్రమంలో 18 ఏళ్ల వయస్సు పైబడిన వారికి కళ్లను పరీక్షించి అవసరమైన వారికి అద్దాలు, మందులను పంపిణీ చేయనున్నారు. దీంతో పాఠశాల విద్యార్థులకు కంటి వెలుగు–2లో పరీక్షలు జరిపించకపోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

మొదటి విడతలో విద్యార్థులకు కూడా..

రాష్ట్రంలో 2018లో నిర్వహించిన కంటి విడత



మొదటి విడత కార్యక్రమంలో విద్యార్థులకు కూడా పరీక్షలను నిర్వహించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి అద్దాలను సైతం పంపిణీ చేశారు. కానీ రెండో విడత కార్యక్రమంలో విద్యార్థులను పట్టించుకోకపోవడంతో కార్యక్రమాన్ని ప్రభుత్వం రాజకీయ కోణంలోనే చూస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కంటి వెలుగు రెండో విడతలో అందరికి కంటి పరీక్షలను నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు అవకాశం ఇవ్వాలి..



కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో ప్రభుత్వం విద్యార్థులకు అవకాశం కల్పించకపోవడం హేయమైన చర్య. కంటి వెలుగు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. కంటి వెలుగులో అందరికి పరీక్షలను జరిపించాలి. విద్యార్థులకు ప్రత్యేక సమయం కేటాయించాలి.

– వేణు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, నిజామాబాద్

ఓట్ల కోసమే కంటి వెలుగు..



కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రాజకీయ కోణంలోనే నిర్వహిస్తుంది. వచ్చే ఎన్నికల్లో లబ్ధి కోసమే రెండో విడత చేపట్టారు. 18ఏళ్ల వయస్సు నిండని వారికి ఓటు హక్కు లేదనే ఉద్దేశంతోనే కంటి పరీక్షలను నిర్వహించడం లేదు.

– నల్ల నవీన్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నిజామాబాద్

విద్యుత్ షాక్‌తో ఒకరికి తీవ్ర గాయాలు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో ఒక యువకుడికి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా.. గ్రామంలోని రైతు గడ్డం రాజేశ్వర్ వద్ద గల పసుపు బాయిలర్ మిషన్‌లపై ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌట గ్రామానికి చెందిన దౌరి కృష్ణ పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం బాయిలర్‌లో నీళ్లు నింపుకోవడానికి శివారులోని మోటారు పంపు సెట్టు వద్దకు కృష్ణ వెళ్లాడు. బాయిలర్‌లో నీళ్లు నింపుతుండగా అతడు ప్రమాదవశాత్తు కేబుల్‌కు తగలడంతో విద్యుత్ షాక్ గురయ్యాడు. వెంటనే స్థానికులు తీవ్ర గాయాలపాలైన కృష్ణను మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

దేశీదారు పట్టివేత



ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డ నిందితుడు, దేశీదారు సీసాలు

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని ఖండ్‌గావ్ గ్రామంలో మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు బాటిళ్లను సీజ్ చేసినట్లు బోధన్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ తెలిపారు. బోధన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించగా మహారాష్ట్ర నుంచి షాదుల్లా అనే వ్యక్తిని పట్టుకుని అతని వద్ద 180 ఎంఎల్ 120 దేశీదారు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సై బాలయ్య, పీసీలు సంజీవ్, శ్రీనివాస్, సుదర్శన్, ప్రమోద్‌లు పాల్గొన్నారు.

చెరువు కట్ట ధ్వంసంపై కేసు నమోదు



చెరువు కట్టను పరిశీలిస్తున్న ఎస్సై

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ నాగప్ప చెరువు కట్టను ధ్వంసం చేసి రోడ్డును తన పొలం వద్దకు వేసుకున్న రైతు రాపర్తి చంద్రగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ మంగళవారం తెలిపారు. నాగప్ప చెరువు కట్టను ధ్వంసం చేసిన విషయాన్ని ఇరిగేషన్ ఏఈ ఆనందం ఫిర్యాదు చేయడంతో తాము ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించామన్నారు. ఈమేరకు కట్టను ధ్వంసం చేసిన రైతు రాపర్తి చంద్రగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కల్లు విక్రయదారుడిపై ..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రం గోపాల్‌పేట కల్లు దుకాణ విక్రయదారుడు లచ్చాగౌడ్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఇటీవల దుకాణంలో కల్లు సీసాను కొనుగోలు చేసిన ఓ వినియోగదారుడికి సీసాలో కుళ్లిన ఎలుక రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కల్లు విక్రయదారుడితో పాటు కల్లుదుకాణ యాజమానిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని తిరుమల కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన అశోక్ తన తల్లి ఇటీవల మరణించింది. దీంతో ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి మోర్తాడ్ మండలం తిమ్మర్‌గ్రామానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వారు ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం ధ్వంసం చేసి ఉంది. బీరువాలో ఉన్న పన్నెండున్నర తులాల బంగారం, రూ.1లక్ష నగదు, చిన్నారుల ఆట వస్తువులు చోరీకి గురయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బ్యాంక్‌లో చోరీకి యత్నం

బిచ్కుంద: మండలంలోని శాంతాపూర్‌లోగల తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండుగులు చోరీకి యత్నించారు. దుండగులు తాళం పగలగొట్టి సేఫ్టీ లాకర్ రూంలో ప్రవేశించగా సెక్యూరిటీ అలారం మోగింది. దీంతో అలర్ట్ అయిన బ్యాంక్ మేనేజర్ లతీఫ్ వెంటనే బిచ్కుంద పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపు దొంగలు అక్కడినుంచి పారిపోయినట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

బోధన్: ఓ హత్యాయత్నం కేసులో ఇరువురికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వంద చొప్పున జరిమానా విధిస్తు మంగళవారం బోధన్ కోర్టులో అసిస్టెంట్ సెషన్ జడ్జి దేవాన్ అజయ్ కుమార్ తీర్పు ఇచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్యాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య తెలిపిన వివరాలు ఇలా.. బోధన్‌లోని ఆజాంగంజ్ కాలనీకి చెందిన కానుగుల వార్ రమేష్ కుమార్‌కు 2000 సంవత్సరంలో సదాశివనగర్ మండలం బొంపల్లి గ్రామానికి చెందిన సంధ్యతో పెళ్లి జరిగింది. వీరికి పదమూడేళ్ల కూతురు కీర్తన ఉంది. రమేష్ కుమార్, చెక్కిక్యాంప్‌కు చెందిన తప్పెట్ల ప్రభుదాస్ స్నేహితులు. రమేష్‌కుమార్ భార్య సంధ్యతో ప్రభుదాస్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిసిన రమేష్ కుమార్ భార్యను పలుమార్లు మందలించాడు. దీంతో భర్త అడ్డు తొలగించుకోవాలని 2019 మార్చి 19న రాత్రి రమేష్ కుమార్‌ను సంధ్య, ప్రియుడు ప్రభుదాస్‌లు కలిసి నోరు మూసి గొంతును నొక్కి హత్య చేసేందుకు ప్రయత్నించారు. వెంటనే పక్క గదిలో నిద్రిస్తున్న అత్త చంద్రవ్వ, కూతురుకు మెళుకువ రావడంతో బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా, గదికి తాళం వేసి ఉండటంతో కేకలు పెట్టారు. దీంతో వారు రమేష్‌కుమార్‌ను వదిలిపెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బాధితుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మరుసటి రోజు రమేష్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కోర్టులో విచారణ జరుగగా.. భార్య సంధ్య, నిందితుడు ప్రభుదాస్‌కు శిక్ష విధిస్తు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

కామారెడ్డిలో ఒకరికి మూడేళ్లు..

కామారెడ్డి క్రైం: హత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తికి మంగళవారం కామారెడ్డి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. వివరాలిలా.. మాచారెడ్డి మండలం సోమార్‌పేట్‌తండాకు చెందిన జరుపుల సంకీ అనే మహిళపై 2017లో హత్యాయత్నం జరిగింది. కుటుంబ గొడవల నేపథ్యంలో సమీప బంధువైన జరుపుల నవీన్ ఆమెపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన ఆమెను ఆస్పత్రికి తరలించి, నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ జరుపగా.. నిందితుడికి మూడేళ్ల జైలు, రూ. 100 జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషెన్స్ జడ్జి కిరణ్‌కుమార్ తీర్పు వెల్లడించారు.

నేడు వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎక్సైజ్‌శాఖ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన (03) వాహనాలకు గురువారం ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

కుక్కల దాడిలో 35 గొర్రెల మృతి



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ గ్రామంలో కు క్కలు దాడిచేయగా 35 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన భూష మధు మంగళవారం ఉదయం గ్రామ శివారులో తన 70 గొర్రెల చుట్టు కంచె కట్టి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఊరకుక్కలు కంచెలోకి చొరబడి గొర్లపై దాడి చేశాయి. ఈ దాడిలో 35 గొర్రెలు మృతి చెందగా మరో 17 గొర్లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పశుసంవర్ధక శాఖ అధికారి హన్మంత్‌రెడ్డి గాయపడిన గొర్రెలకు చికిత్స నందించారు. దాదాపు రూ. 2.5లక్షల నష్టం వాటిల్లిందని, తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

వివాహిత అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని 4వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్‌కు చెందిన నీలిమా అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఈనెల 7న ఉదయం నీలిమా తన 19నెలల చిన్నకుమారుడికి ఆరోగ్యం బాగాలేనందున ఆస్పత్రిలో వెళుతానని ఇంటి నుంచి వెళ్లింది. ఇప్పటికీ ఇంకా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఈమేరకు భర్త శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.